క్లుప్తంగా

వైభవంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పొన్నూరు: మండలంలోని తాళ్లపాలెంలోని విజయ గణపతి, అభయాంజనేయస్వామి దేవస్థానం 16వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విశేష పూజలు, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ పాల్గొని స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచి చుండూరు వీరయ్య, ఆలయ ధర్మకర్త చుండూరు పిచ్చయ్య, ఏపూరి వీరబాబు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పొన్నూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ప్రజా సమస్యలకు వెంటనే పరిష్కారం

తహసీల్దార్ జియావుల్‌హక్



పొన్నూరు: వివిధ సమస్యలపై మండల ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియా వుల్ హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. మండలంలోని చింతలపూడి గ్రామం నుంచి రీసర్వేకు సంబంధించి రెండు, రేషన్ కార్డు కోసం పట్టణం నుంచి 4 దరఖాస్తులను స్వీకరించినట్లు, వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ దేగల వెంకట్రామయ్య, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణ బాధ్యత మనందరిది



ప్రత్తిపాడు: కాలుష్య నివారణ బాధ్యత సమాజంలో అందరిపైనా ఉందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రె.సి.సంధ్య అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా గుంటూరు రూరల్ మండలం గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సోమవారం కాలుష్య నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలుష్య నియంత్రణకు ప్రజలు పాటించాల్సిన చర్యలను వివరిస్తూ నినాదాలు చేస్తూ కాలుష్య రహితంగా సైకిళ్లతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షాద్‌రోజ్, బయోటెక్నాలజీ విభాగాధిపతి వనజ, రంజిత పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవడం మన ధర్మం



ప్రత్తిపాడు: ప్రకృతిని కాపాడుకోవడం మన ప్రధాన ధర్మమని గుంటూరు రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ఎండీ నజీనా అన్నారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరంలోని చిప్స్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ నజీనా మాట్లాడుతూ భోపాల్ గ్యాస్ విడుదల సమయంలో జరిగిన తీవ్ర నష్టాన్ని విద్యార్థులకు వివరించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏ విధంగా పని చేస్తుంది, ఎలాంటి పొల్యూషన్ నియంత్రణ చర్యలు తీసుకుంటుంది.. వంటి పలు విషయాలను వివరించారు. మనం అనుసరిస్తున్న అన్ని ధర్మాలలో ముఖ్యమైన ధర్మం ప్రకృతిని కాపాడుకోవడమేనని స్పష్టం చేశారు. అందుకోసం మనమంతా కలిసికట్టుగా ప్రయత్నం చేయాలని సూచించారు. నెలలో ఒక రోజు ప్రకృతి హిత కార్యక్రమాలను నిర్వహించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పొల్యూషన్ నియంత్రణపై నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నజీనా బహుమతులు అందించారు.

కల్లాల్లో కలవరింత..

- ఎక్కడి ధాన్యం అక్కడే
- వర్షాలతో అన్నదాతల పరుగులు
- తేమపేరుతో సాగని కొనుగోళ్లు
- పరదాల కింద టన్నుల కొద్దీ ధాన్యం నిల్వలు

పొన్నూరు: ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడు రోజుల నుంచి వాతావరణం మబ్బులు కమ్ముకొంది. దీంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంది. పలు గ్రామాల్లో వరి కోతలు పూర్తయినా ఇంకా మండల వ్యాప్తంగా 24 వేల ఎకరాల్లో కోతలు పూర్తికాలేదని అధికారులు చెబుతున్నారు. కోతలు పూర్తయిన ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉంది. చిన్నా పెద్దా అంతా కల్లాల వద్ద పట్టకప్పిన ధాన్యం నిల్వల వద్ద పడి గాపులు కాస్తున్నారు. ఎండొస్తే పట్టతీయడం, మబ్బు రాగానే కుప్పలు చేసి కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారు. 22 శాతం వరకు తేమ ఉన్నా కొనాలని ఆ శాఖా మంత్రి ఆదేశాలిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలవడం లేదు. ఫలితంగా పొలాల్లోనే వ్యాపారులకు అమ్మేస్తూ నష్టపోతున్నారు.

జాప్యంతో అవస్థలు

పొన్నూరు మండలంలోని మునిపల్లె, పచ్చల తాడిపర్రు, కసుకర్రు, వల్లభరావు పాలెం, వెల్లలూరు,



పొలాల వద్దనే ధాన్యానికి పట్టకప్పిన రైతులు

మనవ, మామిళ్లపల్లి తదితర గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే మండలంలోని పది రైస్ మిల్లుల ద్వారా సోమవారానికి మొత్తం 3,040 క్వింటాల వరకు కొనుగోలు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

తేమతో తిప్పలు

నిబంధనల ప్రకారం 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని కొనాల్సి ఉండగా, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 22 శాతం వరకు ఉన్నా కొనాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలు క్షేత్రస్థాయి అధికారులకు పట్టడంలేదు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యం కొనరనే ఆందోళనతో పొలాల పక్కన ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడ ఆరబెట్టుకుంటున్నారు. కనీసం వారం సమయం పడుతోందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈదురుగాలులు, వర్షానికి వాలిన వరి

పొన్నూరు మండలంలో ఇలా..

వరి సాగు విస్తీర్ణం	27 వేల ఎకరాలు
దిగుబడుల అంచనా(ఎకరానికి)	35 బస్తాలు
మద్దతు ధర ఏ గ్రేడు (75 కిలోలు)	రూ.1,720
వ్యాపారుల ధర	రూ.1,400
ఇప్పటి వరకు కొనుగోలు	3,040 క్వింటాలు

భయమేస్తోంది

నాలుగురోజుల కిందట వరి కోశాను. మబ్బులు పట్టడం, అప్పుడప్పుడూ వర్షం పడుతుండటంతో ధాన్యం దెబ్బ తింటుందని భయమేస్తోంది. తేమశాతం లెక్కలోకి తీసుకోకుండా రైతుల నుంచి కొంటే మేలు కలుగుతుంది.

– వెంకట్రావు, రైతు

వరి కోతలు ఆపాలి



తుపాను నేపథ్యంలో వరి కోతలు ఆపాలని రైతులకు సూచిస్తున్నాం. ధాన్యం అమ్మాలని వచ్చిన వారం దరి నుంచీ కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లకు సూచిస్తున్నాం. మండలంలో ప్రస్తుతం మూడు వేల ఎకరాల్లో మాత్రమే కోతలు జరిగాయి. కొన్ని గ్రామాల్లో కోతలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కావాల్సి ఉంది. పొలాల్లోని వరి తడిస్తే వారం రోజుల వరకు ఇబ్బంది ఉండదు.

– దేగల వెంకట్రామయ్య, మండల వ్యవసాయాధికారి, పొన్నూరు

మధ్యాహ్న భోజనం తనిఖీ

కాకుమాను: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక(స్పెషల్) పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు కేటాయించిన మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. భోజనాన్ని రుచి చూశారు. ఆయన వెంట హెచ్ఎం వెంకట దుర్గా మాధవి ఉన్నారు.

ఏఎన్‌యూ విద్యార్థుల ఫారెస్ట్ స్టడీ టూర్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ విభాగం విద్యార్థులు ఫారెస్ట్ స్టడీ టూర్‌ను పూర్తి చేశారు. స్టడీ టూర్‌లో భాగంగా విద్యార్థులు రాజమహేంద్రవరం, రంపచోడవరం మారేడుమిల్లి, సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, కోరింగ్ వైల్డ్ లైఫ్ సంక్చరీలను సందర్శించి ప్రకృతి పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సంబంధించిన అంశాలను పరిశీలించినట్లు విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. స్టడీ టూర్ వివరాలను ఆయన సోమవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావుకు అందజేశారు. అరణ్య పరిసరాలు, వాటి సంరక్షణ, వన్యప్రాణుల జీవన విధానం, మానవ సంబంధాలపై టూర్‌లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అరణ్య ప్రాంతాలపై జరుగుతున్న పరిశోధనలు, పర్యావరణ సంరక్షణ చర్యలు, జంతు సంరక్షణ, హైటెక్ నర్సరీలు, ఎకోటూరిజం వంటి అంశాలను విద్యార్థులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారన్నారు. సందర్శించినట్లు మల్లికార్జున తెలిపారు.

రోడ్డెక్కిన డ్వాక్రా మహిళలు

- నకిలీ తీర్మానాలు, ఫోర్జరీ సంతకాలతో వీఓఏ మార్పుపై ఆగ్రహం
- ఏపీఎం సరిగా స్పందించకపోవడంతో రోడ్డెక్కి ప్లకార్డులతో ఆందోళన



పాతమద్రాసు రోడ్డుపై ఆందోళన చేస్తున్న గొట్టిపాడు రాధాకృష్ణ గ్రామ సంఘం సభ్యులు

ప్రత్తిపాడు: డ్వాక్రా మహిళలు రోడ్డెక్కారు. నకిలీ తీర్మానాలు, ఫోర్జరీ సంతకాలతో మాకు తెలియకుండా మా వీఓఏను ఎలా మారుస్తారని నిప్పులు చెరిగారు. మా హక్కులను మీరే కాలరాస్తారా.. అంటూ వెలుగు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఏపీఎం తీరును నిరసిస్తూ రోడ్డెక్కి ప్లకార్డులతో ఆందోళన చేశారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘానికి సంబంధించి విధులను నిర్వర్తిస్తున్న వీఓఏ(యానిమేటర్) జె.శ్రీకాంతం పేరును ఆన్‌లైన్ లాగిన్ల నుంచి తొలగించి, వీఓ సభ్యులకు తెలియకుండా అదే గ్రామానికి చెందిన ఎన్.స్వాతిని ఆన్‌లైన్ లాగిన్‌లో నమోదు చేయడాన్ని నిరసిస్తూ రాధాకృష్ణ వీఓకు చెందిన డ్వాక్రా లీడర్లు, సభ్యులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చారు. తొలుత తహసీల్దార్ కరుణకుమార్‌ను కలిసి తమ సమస్యను ఏకరువు పెట్టారు. లిఖితపూర్వకంగా ఇస్తే విచారణ చేయిస్తానని తహసీల్దార్ మహిళలకు సూచించారు. అందుకు మహిళలు ససేమిరా అన్నారు. ఇదే కార్యక్రమంలో ఏపీఎం ఉన్నారని, మా వీఓఏ లాగిన్‌ను తొలగించి వేరే వాళ్లకు లాగిన్ ఎలా ఇచ్చారో బయటకు వచ్చి చెప్పాలని పట్టుబట్టారు. దీంతో ఏపీఎం వి.లాజరు బయటకు వచ్చి మహిళలతో మాట్లాడారు. ఐదు నెలలుగా ప్రస్తుతం ఉన్న వీఓఏతో ఎందుకు పని చేయించడం లేదని, ఇదేమని సంఘంలోని లీడర్లు, సభ్యులు అడిగితే శ్రీకాంతమే మీ వీవోఏ, ఆన్‌లైన్ లాగిన్లు, ఫోన్ నంబర్లు అన్నీ తనవేనని చెబుతూ వస్తున్నారని తెలిపారు. స్త్రీనిధి రుణాలు లాగిన్ చేసేందుకు వీవోఏ శ్రీకాంతం యాప్ ఓపెన్ చేస్తే, లాగిన్‌లో శ్రీకాంతం ఆధార్ నంబరు లేకుండా స్వాతి అనే మహిళ ఆధార్ నంబర్లు కనిపించాయని, ఇదెలా సాధ్యమని నిలదీశారు.

పాతమద్రాసు రోడ్డెక్కి..

దీంతో ఏపీఎం తీరును నిరసిస్తూ డ్వాక్రా మహిళలు తహసీల్దార్ కార్యాలయం బయట గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డెక్కి ఆందోళన చేశారు. బస్సులను నిలిపి సర్క్యులర్లు, జాబ్‌చార్టులు పాటించని ఏపీఎంను సస్పెండ్ చేయాలి, గ్రామ సంఘం, ఈసీల ప్రమేయం లేని తీర్మానాన్ని ఆమోదించిన ఏపీఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై నిలబడి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కె. నాగేంద్ర ఘటనా స్థలానికి చేరుకుని డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. కచ్చితంగా గ్రూపుల సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు. ఈ మేరకు ఏపీఎంకు వినతిపత్రం అందించారు.

తప్పుడు ఫిర్యాదులతో భయపెట్టలేరు..

ఇదిలా ఉంటే ఏపీఎం లాజరు మహిళలతో మాట్లాడుతున్న సమయంలో వారు చెప్పేది వినకుండా లోపలకు వెళుతున్న సమయంలో డ్వాక్రా మహిళ ఏపీఎం చెయ్యి పట్టుకుని మా బాధలను విని వెళ్లాలని కోరారు. దీంతో ఆయన మహిళలు నా చెయ్యి పట్టుకుని నన్ను కొట్టబోయారని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. దీంతో మహిళలు మరింత ఆగ్రహానికి గురయ్యారు. తప్పుడు ఫిర్యాదులతో మహిళల గొంతు నొక్కి భయపెట్టలేరని అన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రత్తిపాడు: విద్యార్థులు సృజనకు పదునుపెట్టి, భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి అన్నారు. గుంటూరురూరల్ మండలం చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, చేతనలో ఆర్ట్స్, సైన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఎక్స్‌పో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు డాక్టర్ నీలిమ, ప్రొఫెసర్ మల్లేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఎక్స్‌పోను ప్రారంభించారు. చిప్స్ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మల్లేశ్వరరావు, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ దంత వైద్యురాలు డాక్టర్ నీలిమ , కాటూరి ఆస్పత్రి వైద్యుడు విజయ్‌చంద్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.డి. నస్రీన్, మల్లికార్జున రావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, సీఏఓ దుర్గారఘురామ్, చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో కొలరిడో–2024



ప్రత్తిపాడు: ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 27, 28 తేదీల్లో కొలరిడో–2024 పేరుతో జాతీయ స్థాయిలో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్, కె. మద్దినేని తెలిపారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో సోమవారం కొలరిడో–2024 పోస్టర్లుతో పాటు ఆన్‌లైన్ నమోదుకు సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ కల్చరల్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచే విద్యార్థులకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు, మెమెంటోలు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఆర్‌వీఆర్‌జేసీసీఈ.ఏసీ.ఇన్/కొలరిడో2024 వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ పి.కిషోర్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాటానికి వెనుకాడం



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో భాగంగా ఆయా ప్రాంతాల సమస్యలు, స్థానికంగా ఏర్పడిన రాజకీయ పర్యవసానాలపై చర్చించారు. కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్న అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా... కనీసం ప్రజలకు ఒక్క మేలు చేసిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఇదేమని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులతో పార్టీ కార్యకర్తలతో పాటు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లను కూడా భయపెట్టేందుకు ఏ మాత్రం వెనుకాడటంలేదని విమర్శించారు. ఇటువంటి కేసులకు, తాటకు చప్పుళ్లకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఒక్క అడుగు కూడా వెనక్కి వేయరన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా, ప్రజల పక్షాన ఎంతటి పోరాటానికి వెనుకాడని విధంగా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సమన్వయకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు(డైమండ్), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

వర్సిటీ అధికారులను కలిసిన వికాస నూతన కార్యవర్గం



ఆచార్య నాగార్జునుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వికాస నూతన కార్యవర్గం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధ్యాపకేతర సిబ్బంది సంఘం(వికాస) నూతన కార్యవర్గ నాయకులు సోమవారం వర్సిటీ ఉన్నతాధికారులను అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీ ఆచార్య కే గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కే రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధిలో ఉద్యోగుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వికాస నాయకులు ఉన్నతాధికారులకు పేర్కొన్నారు. తొలుత యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఆచార్య నాగార్జునుడి విగ్రహానికి, యూనివర్సిటీలోని జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికాస అధ్యక్షుడు ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.విజయప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులు టి.వెంకటేష్, ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారి కె.యేషయ్య, కార్యవర్గ సభ్యులు సీహెచ్ ఆనంద్ కుమార్, పి.నాగరాజు, సిహెచ్.సాంబశివరావు, కె.శశిధర్, జి.శ్రీను, ఎన్.శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు ఉన్నారు. వర్సిటీ విభాగాలలో స్వీట్లు పంచి వికాస ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ముగ్గురు గంజాయి నిందితులు అరెస్ట్



నిందితుల వివరాలను తెలియజేస్తున్న తెనాలి డీఎస్పీ జనార్ధనరావు

చేబ్రోలు: కాలేజీలలో చదువుతున్న విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంజాయి కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ భువనేశ్వర్ ప్రాంతానికి చెందిన ప్రహుదానంద దాస్, ప్రసనరౌత్రే, కాండియాహట్ ప్రాంతానికి చెందిన జడజెనాలు చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలోని కామధేను ఫీడ్స్ కంపెనీ సమీపంలోని ఖాళీ ప్రదేశం వద్ద అనుమానాస్పదంగా సంచులతో కనిపించారు. ముగ్గురు నిందితులు పోలీసుల రాకను గమనించి పారిపోవటానికి ప్రయత్నించారు. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి.వెంకటకృష్ణ, సిబ్బంది అదుపులోకి తీసుకొని వారిని విచారించారు. నిందితులు స్పిన్నింగ్ మిల్లులలో కార్మికులు, కూలిపనులు చేసుకొని జీవిస్తూ, గంజాయికి అలవాటు పడి, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నారు. ఒరిశా నుంచి తీసుకువచ్చిన 4.2 కిలోల గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి చేబ్రోలు, తెనాలి మండలంలోని కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు, స్పిన్నింగ్ మిల్లులలో పని చేసే కార్మికులకు, నిరుద్యోగ యువతకు గంజాయి పొట్లాలు అమ్మి ఎక్కువ మొత్తంలో డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారు. నిందితులు ఒరిశా రాష్ట్రంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి పది వేల రూపాయలకు 4.2 కిలోల గంజాయిని రోడ్డు, రైలు మార్గాల ద్వారా నారాకోడూరుకు తీసుకువచ్చి, దీపక్ దగ్గర ఉంచారు. నిందితులు గంజాయిని వాటాలు చేసుకొని విక్రయించటానికి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి.వెంకటకృష్ణ, సిబ్బందిని డీఎస్పీ జనార్ధనరావు అభినందించారు.

రహదారులు .. గోతుల మయం



నంబూరు రోడ్డులో గోతులకు ముళ్లకంచె



ఉప్పలపాడు, గోళ్లమూడి మధ్య దుస్థితి

పెదకాకాని: పాలకుల అలసత్వం అధికారులు నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల మీదుగా నిత్యం వయా నందివెలుగు మీదుగా తెనాలి నిత్యం వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. హాఫ్‌పేట ప్రధాన రోడ్డు నుంచి తంగెళ్లమూడి, అనుమర్లపూడికి ప్రతిరోజూ గ్రామస్తులు గోతులుగా మారిన రోడ్లతో అవస్థలు పడుతున్నారు. ఉప్పలపాడు నుంచి గోళ్లమూడి, నంబూరు వెళ్లే రోడ్లు గోతులు పడటంతో పాటు రోడ్డు పలు ప్రాంతాలలో కుంగిపోయింది. వేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా రోడ్డుపై చప్టా విరిగి గోతులు పడటంతో ఆగోతుల్లో కట్టెపుల్లలు పెట్టి వాటికి గుడ్డముక్కలు కట్టారు. వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు జరగకుండా గోతుల్లో ముళ్లకంచె వేశారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో చదరంగం శిక్షణ శిబిరం



ప్రత్తిపాడు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ చదరంగం జట్టుకు శిక్షణ శిబిరాన్ని గుంటూరు రూరల్ మండలం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు సోమవారం ప్రారంభించారు. విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో ఈ నెల 6వ తేదీ నుంచి 8 వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు నాలుగో తేదీ వరకు చదరంగంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.వి.రాఘవయ్య తెలిపారు. గత నెల 19, 20 తేదీల్లో చలపతి ఫార్మసీ కళాశాల వేదికగా నిర్వహించిన అండర్ విశ్వవిద్యాలయ చదరంగం పోటీలలో గెలుపొందిన విజేతలకు కూడా నాలుగో తేదీ వరకు ఎం.గోపీనాథ్ శిక్షణ ఇస్తారని చెప్పారు. జేకేసీ కాలేజీ నుంచి ఎస్.వైష్ణవి, చలపతి ఫార్మసీ కళాశాల నుంచి బి.సాయి తేజ, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎస్.మేరీ, సి.హెచ్.అనూష, చలపతి ఫార్మసీ కళాశాల నుంచి ఆర్.నాగవైష్ణవి, కె.స్వప్న మాధురి శిక్షణ పొందుతున్నారు. విద్యార్థులను చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామారావు అభినందించారు.